


21న జాతీయ లోక్ అదాలత్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 21న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కరీంనగర్ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ వాహన చట్టానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ కేసులు, చిట్‌ఫండ్స్ కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ప్రింటింగ్ ప్రెస్, వాహనాలకు గిరాకీ

- ప్రచార హోరుతో పలువురికి ఉపాధి



హుజూరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజ న్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ మంగళ వారంతో ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో ప్రింటింగ్ ప్రెస్, వాహన దారు లకు డిమాండ్ పెరిగింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు రకరకాల పద్ధతులు అవలంబిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి ప్రధానంగా ఆటో లు, మైక్‌లు అమర్చిన మినీ వ్యాన్లకు గిరాకీ పెరిగింది. తమ ప్రచారాన్ని హోరెత్తించడానికి వాహనాలకు రోజు వారీగా అద్దెకు తీసుకుంటున్నారు. సాధారణ రోజుల కంటే ఎన్నికల సమయంలో రోజు వారి కంటే వాహనదారులకు అదనంగా ఆదాయం లభిస్తోంది. వాహనాలకు అమర్చే మైక్ సెట్టు ఆపరేటర్లకు గ్రామాల్లోనూ ఉపాధి లభిస్తోంది. అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో కరపత్రాలు, గోడపత్రికలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తయిన వెంటనే అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను కరపత్రాల్లో ప్రింట్ ఇస్తు న్నారు. దీంతో ప్రింటింగ్ ప్రెస్‌లు జోరుగా పని చేస్తున్నాయి. అభ్యర్థుల ఫోటోలు, ఎన్నికల గుర్తులతో ఆకర్షణీయమైన డిజైన్లను చేయడంలో ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వాహకులు పని దొరికింది. కొంత మంది తమ గుర్తులను పాటల రూపంలో రికార్డు చేయించి వాహనాలకు అమర్చుతున్నారు. రికార్డు స్టూడియోల వారికి ఉపాధి లభిస్తోంది.

ఇంటింటికి మాంసం..మందు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళ వారంతో ముగిసింది. దీంతో అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారు. ఎవరికి తగ్గట్టుగా వారు గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విందులు వినోదాలతోపాటు డబ్బులు పంచుతున్నారు. ఉదయం లేచేసరికే పలు గ్రామాల్లో ఓటర్ల ఇళ్ల వద్దకు మాంసం సరఫరా చేశారు. సాయంత్రం పోటాపోటీగా మద్యాన్ని పంపిణీ చేశారు. ఒక్కో గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులు వెయ్యి నుంచి 1,500 వరకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఉప సర్పంచ్ పదవిని ఆశిస్తున్నవారు ముందుగా గ్రామంలో వార్డు మెంబర్లుగా గెలిచి అనంతరం వార్డు సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం పోలింగ్ ముగియగానే ఓట్లు లెక్కిస్తారు. తరువాత ఎన్నికలఫలితాలు విడుదల అవుతాయి. తరువాత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు.

పట్టణాల్లో ఉన్న ఓటర్లపై దృష్టి

- పోటీ పడి ఫోన్లు చేస్తున్న అభ్యర్థులు

సైదాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. అధికారులు బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. అభ్యర్థులు పట్టణాల్లో ఉన్న ఓటర్లను కలిసేందుకు పరుగులు తీస్తున్నారు. ఎవరు ముందు వెళ్లి కలిస్తే వారికి పట్టణాల్లో ఉన్న ఓటర్ల మద్దతు లభిస్తుందని భావిస్తున్నారు. ఒక్కసారి కలిసి మాట తీసుకుని వస్తే ఊళ్లో ప్రచారం చేసుకోవచ్చని అనుకుంటున్నారు. సైదాపూర్ మండలం నుంచి వెయ్యి మందికి పైగా ఓటర్లు హైదరాబాద్ తోపాటు ఇతర పట్టణాలలో ఉంటారు. ఎక్కువ శాతం పల్లెటూర్ల నుంచి వెళ్లి హైదరాబాద్‌లోని మోండా మార్కెట్ (కూరగాయల మా ర్కెట్)లో పని చేస్తారు. దీంతో సర్పంచ్‌కు పోటీ చేసే అభ్యర్థులు మోండా మార్కెట్‌కి వెళ్లి అందరినీ ఒకే చోట చేర్చి విందులు ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. కొందరికి ఫోన్లు చేసి తనకు మద్దతు తెలపాలని బతిమిలాడుతున్నారు. ఎన్నికల సమయంలో సికింద్రాబాద్ మోండా మార్కెట్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుంటారు.



- మూడోవిడతలో ముగ్గురు సర్పంచ్‌లు, 184 వార్డులు ఏకగ్రీవం
- 108 సర్పంచు పదవులకు 453, 850 వార్డు పదవులకు 2,329 మంది పోటీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తొలి విడతలో ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో ప్రచారం ముగిసింది. ఈనెల 11న కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లోని పంచాయతీలకు పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపును ప్రారంభించి ఫలితాలు ప్రకటిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. తొలి విడతలో ఐదు మండలాల్లోని 92 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి.

పోలింగ్‌కు ఏర్పాట్లు

తొలి విడత పంచాయతీల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. ఎన్నికలు జరగనున్న ఐదు మండలాల పరిధిలో నిషేధాజ్ఞలు విధించారు. మద్యం దుకాణాలను మూసివేశారు. మద్యం దుకాణాలను మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 11న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించి వారికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సామగ్రిని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఇప్పటికే అందజేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సీపీ గౌస్‌ఆలం భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ర్యాలీలు, బహిరంగ సభలు నిషేధం: కలెక్టర్

పోలింగ్‌కు 44 గంటల ముందు నుంచి ఆయా మండలాలు, గ్రామాల్లో సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుంది. పోలింగ్ ముగిసే వరకు సభలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. బయట నుంచి వచ్చిన వ్యక్తులు ఆయా పంచాయతీల పరిధిలో ఉండకూడదని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ సూచించారు.

మూడో విడత పంచాయతీల్లో ఉపసంహరణ పూర్తి

మూడో విడతలో ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. ఈ విడతలో వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజూరాబాద్, సైదాపూర్ మండలాలకు చెందిన 111 గ్రాపంచాయతీల సర్పంచ్ పదవులకు, 1,034 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల్లో ఈ నెల 3 నుంచి 5 వరకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం తర్వాత మంగళవారం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన తర్వాత ఈ విడతలో సైదాపూర్ మండలం ఆరెపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ పంచాయతీలో సర్పంచ్‌గా వర్నె లావణ్య (మిగతా 8వ పేజీలో)

తొలి విడత ఎన్నికల వివరాలు

మండలం	సర్పంచ్ స్థానాలు	వార్డు సభ్యులు
గంగాధర	33	296
రామడుగు	23	222
చొప్పదండి	16	154
కొత్తపల్లి	6	62
కరీంనగర్ రూరల్	14	132

చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామంలో సర్పంచ్, ఎనిమిది వార్డులకు సింగిల్ నామినేషన్లు రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ పంచాయతీలో వడ్లకొండ తిరుమల ఏకగ్రీవ సర్పంచు ఎన్నికయ్యారు. చొప్పదండి మండలం పెద్దకురమపల్లి పంచాయతీ సర్పంచ్‌గా మావురం సుగుణ, రామడుగు మండలం శ్రీరాములపల్లి సర్పంచ్‌గా ఒంటెల సుగుణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విడతలో ముగ్గురు సర్పంచ్‌లతోపాటు 276 వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 89 సర్పంచ్ పదవులకు 338, 590 వార్డు సభ్యుల పదవులకు 1762 మందిపోటీపడుతున్నారు. ఈనెల 11న వీరి భవితవ్యం తేలనున్నది.

ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడవద్దు : సీపీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరిగే కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, చొప్పదండి, రామడుగు మండలాల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయని సీపీ గౌస్‌ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదుగురు అంత కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండవద్దన్నారు. ఈ మేరకు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబరు 11న జరగనున్న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల ప్రశాంత నిర్వహణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ ఉత్తర్వులు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ రాత్రి 11:59 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని సీపీ గౌస్ ఆలం హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మానకొండూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- సర్పంచ్ అభ్యర్థి జవ్వాజి శ్రీలత మహేందర్



మానకొండూర్‌లో ప్రచారం చేస్తున్న జవ్వాజి శ్రీలత మహేందర్

మానకొండూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి జవ్వాజి శ్రీలత మహేందర్ అన్నారు. ఆమె కాలనీవాసులు, యువకులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్‌లో 3వ నంబరు బ్యాటు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనకు ఎలాంటి పదవి లేకున్నా గ్రామంలో వాటర్ ప్లాంట్ చెడిపోతే లక్షా 33 వేల రూపాయలను సొంతంగా ఖర్చు చేసి మరమ్మతులు చేయించి ప్రజలకు తాగు నీరందించినట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని చెరువుకట్ట వద్ద ఉన్న శశ్మాన వాటిక నిర్మాణానికి సొంత ఖర్చులతో పునాదిరాయి వేయించా నన్నారు. పదవిలో లేకున్నా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. తనను గెలిపిస్తే విద్యుత్‌లైట్లు, మురికికాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తాన న్నారు. మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వేములవాడ బస్టాండ్ వద్ద ఒకరికి గుండెపోటు

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద మంగళవారం గుండెపోటుతో కుప్పకూలిన వ్యక్తికి పోలీసులు సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. నాంపల్లి గ్రామానికి చెందిన రమేష్(49) అనే వ్యక్తి తిప్పాపూర్ బస్టాండ్ వద్ద గుండెనొప్పితో మంగళవారం ఉదయం కుప్పకూలడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగరాజులు సీపీఆర్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించినప్పటికీ రమేష్ మృతి చెందాడు.

చలికాలంలో నారు మడి

- తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో వరి సాగు చేసే రైతులు ఇప్పుడిప్పుడే నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో వ్యవసాయ భూమి 16,92 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. 12,623 ఎకరాలో వరి సాగు, 854 ఎకరాల్లో మొక్కజొన్న పప్పు దాన్యాలు 50, ఇతర పంటలు 85 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం చలి కాలంలో వరి సాగు చేసే రైతులు నారు మడులను రక్షించుకునేందుకు పలు సూచనలు చేస్తున్నారు.

- మండెకట్టి విత్తనాలు వేయడం తప్పనిసరి

దమ్ము చేసే నారుమడిలో మండెకట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరి. రాత్రి ఉష్ణోగ్రతలు 12 సెల్సియస్ డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు సరిగా ఎదగదు, కొన్ని సార్లు ఎర్రబడి చనిపోతుంటాయి. రెండు గుంటల నారుమడికి వానాకాలం సూచించిన మోతాదులో రసాయనిక ఎరువులతో (నత్రజని, పొటాష్) పాటు రెండు క్వింటాళ్ల మాగిన కోళ్ల ఎరువు లేదా గొర్రె ఎరువు లేద


గోపాల్‌పూర్‌లో నారుమడి

వర్మీ కంపోస్టు వేసి కలియ దున్నాలి. భాస్వరాన్ని దుక్కిలో మోతాదు రెట్టింపు చేయాలి. చలి సమస్యను అధిగమించడానికి నారుమడిపై వెదురు కర్రలతో ఊతం ఇచ్చిపైన పలుచని పాలిథిన్ షీట్స్ లేదంటే ఖాళీ సంచులతో తయారు చేసి పట్టాను సాయంత్రం వేళల్లో కప్పి ఉంచాలి. మరుసటి రోజు ఉదయం తీసేయాలి. యాసంగిలో జింక్ లోప లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ లోపాన్ని సవరించాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి కిలో యూరియాకు రెండు గ్రాముల, కార్బండిజమ్ 25 శాతం ప్లస్ మాంకోజెబ్, 50 శాతం డబ్ల్యూఎస్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రి పూట నీరు నిండుగా ఉంచి తెల్లవారు జామున తొలగించి తాజాగా నీరు అందించాలని చెబుతున్నారు.

ఇరిగేషన్‌శాఖ రాష్ట్ర కన్వీనర్‌గా సంగెం లక్ష్మణ్‌రావు


లక్ష్మణ్‌రావు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల రాష్ట్ర అడ్‌హక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన సంగెం లక్ష్మణ్‌రావు నియామకమయ్యారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మణ్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన నాయకుడు రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇది టీఎన్‌జీవోకు ఎంతో గర్వకారణమని అన్నారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కూడా గతంలో ఇరిగేషన్‌శాఖ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి ఎడ్ల అరవింద్‌రెడ్డి, టీఎన్‌జీవో కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్ పాల్గొన్నారు.

అక్కపల్లిలో మహిళ ఆత్మహత్య


లక్ష్మీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన మహిళ కొంపెల్లి లక్ష్మీ(42) అనారోగ్య సమస్యలు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని లక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు. మరో వైపు లక్ష్మీ భర్త ముత్యం ఇటీవల కాలు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తండ్రి కొడుకులు ముత్యం, మహేశ్‌లు కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి బయలుదేరారు. 45 రోజుల కిందట వివాహమైన కూతురు రాధిక పుట్టింటి నుంచి అదే రోజు అత్తగారింటికి వెళ్లింది. ఆరోగ్య సమస్యలు.. కట్టుకున్న భర్త అనారోగ్యంతో బాధపడుతుండడం వల్ల మనస్థాపం చెందిన ఆమె ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడి గట్టింది. రాత్రయిన లక్ష్మీ మాటలు వినిపించకపోవడంతో అనుమానం వచ్చిన సమీప బంధువులు ఇంటికి వెళ్లి చూశారు. తలుపులకు గడియ వేసుకున్న ఆమె ఎంత పిలిచినా పలకకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషమం తెలుసుకున్న భర్త, కొడుకు హైదరాబాద్ నుంచి హుటాహుటిన వచ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతురాలికి భర్త ముత్యం,కొడుకు మహేశ్, కూతురు రాధికలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య


రజిత (ఫైల్)

తంగళ్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో వివాహిత దీటి రజిత(31) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని అత్త గారింటి నుంచి రజిత ఐదు రోజుల క్రితం నేరెళ్ల లోని తన తల్లి గారింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మూడు సంవత్సరాల క్రితం భర్త సంతోష్ అనారోగ్యంతో మృతి చెందాడు, అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న రజితకు అనారోగ్యం తోడవడంతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఉరివేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతురాలికి కూతురు సౌమ్య(11), శశాంక్(7) ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1,125 కిలో మీటర్లు బైక్‌పై ప్రయాణం

- మార్గమధ్యలో ప్రమాద బీమాపై అవగాహన



ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తున్న అచ్యుత్

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్ సర్వీస్ ఏజెంట్ సమ్మెట అచ్యుత్ వారణాసి వరకు బైక్‌పై ప్రయాణం చేశాడు. 1,125కిలో మీటర్లు ప్రయాణం చేస్తూ మార్గం మధ్యలో లారీ, ఆటో, బస్సు, ట్రక్కు ఇలా వాహన డ్రైవర్ల రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల (పీఎమ్ఎస్‌బివై) ప్రమాద బీమా వస్తుందని అవగాహన కల్పించాడు. ఈ ప్రయాణానికి సహకరించిన బ్యాంక్ మేనేజర్, సిబ్బందికి అచ్యుత్ కృతజ్ఞతలు తెలిపారు.

యూనివర్సిటీలో రెండో రోజు విద్యార్థుల ఆందోళన

- పరీక్షలు వాయిదా వేసిన ఎస్‌యూ అధికారులు

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అకడమిక్ పరీక్షల తేదీలను వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు రెండో రోజు మంగళవారం ఆందోళనకు దిగారు. నెట్, సెట్ వంటి పరీక్షలు, సర్పంచ్ ఎన్నికల తేదీలు పీజీ పరీక్షలు ఉన్నందున యూనివర్సిటీ పరీక్షలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో అధికారులు, విద్యార్థులతో వీసీ ఉమేష్‌కుమార్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ పరీక్షలను జనవరి 5 నుంచి నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపకులపతి, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

బోయినపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని స్థంభంపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌తో పాటు సుమన్ అనే ఇద్దరు వ్యక్తులు స్థంభంపల్లి గ్రామానికి మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, బోయినపల్లి పోలీసులు దాడులు నిర్వహించి 1,33,000 రూపాయల విలువ గల 253 లీటర్ల మద్యం పట్టుకున్నారు. మద్యంతో పాటు వాహనం సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చందుర్తి: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం రామారావుపల్లి గ్రామనికి చెందిన పెద్దిగారి మల్లేష్ అనే వ్యక్తి తన కారులో అక్రమంగా 24 బీర్ సీసాలను తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలలో పట్టుబడినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం చందుర్తి ఇన్‌చార్జి ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె. రమేష్ తెలిపారు.


స్వాధీనం చేసుకున్న మద్యం

మహిళ దారుణహత్య

వెల్గటూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో మంగళవారం రాత్రి అలివేలు (37) అనే మహిళ దారుణహత్యకు గురైంది. మండలి నరేష్ అనే వ్యక్తి అలివేలును రోకలిబండతో తలపై మోది హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్‌కు హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అలివేలుతో పరిచయం ఏర్పడింది. వారు అక్కడే సహజీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్తంభంపల్లికి వచ్చిన ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నరేష్ కోపంతో రోకలి బండతో అలివేలు తలపై బలంగా మోదాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా నరేష్‌కు గతంలో వివాహం కాగా భార్య అతడికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై గుర్తుతెలియని వృద్ధుడు(70) మంగళవారం మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు టూటౌన్ సీఐ ఫోన్. 8712670762, పోలీస్‌స్టేషన్ ఫోన్. 83319 40593, హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబు 8712574215లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కరీంనగర్ క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. జిల్లాలో తొలి సారిగా రాష్ట్ర స్థాయి పోటీలు చేపట్టగా కరీంనగర్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. వయస్సు ప్రకారం గ్రూపులుగా విభజించి వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ నిలవగా... ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు నిలిచాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిని రవికుమార్, కొమ్ము కృష్ణతో పాటు ప్రముఖ వైద్యులు క్రాంతికుమార్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారథి, ఆదిత్య ఖండేష్కర్, బారే శ్రీధర్, రాజు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేసి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి సత్తా చాటాలని అతిథులు ఆకాంక్షించారు. ఓడిపోయిన వారు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో రాణించాలని సూచించారు. క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్


అర్జీదారు వద్ద వివరాలు తీసుకుంటున్న తహసీల్దార్ నాగార్జున

రాయికల్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగార్జున అర్జీదారు వద్దకే వచ్చి భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన కొడిమ్యాల ఇందమ్మ తన భూమి విక్రయించారు. భూమి విక్రయ రిజిస్ట్రేషన్ కోసం కుటుంబ సభ్యులు ఆమెను తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం వరకు ఆటోలో తీసుకువచ్చారు. అర్జీదారు నడవలేని పరిస్థితిలో ఉందని తెలుసుకున్న తహసీల్దార్ మానవత్వంతో స్పందించి కార్యాలయం బయట ఆటోలో ఉన్న ఆమె వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

వైద్య కళాశాలలకు పార్థివ దేహాలను దానం చేయాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలకు పార్థివ దేహాలను దానం చేయడానికి ముందుకు రావాలని సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ కోరారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన మందల రాజిరెడ్డి మృతి చెందగా వారి మనుమడు, మనుమరాలు వర్షిత్, వర్ష రాజిరెడ్డి పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ దేహదానాలు చేయడానికి ముందుకు రావాలని, దేహాలతో విద్యార్థులు అధ్యయనం చేస్తారని అన్నారు. సదాశయ ఫౌండేషన్ పార్థివ దేహాలను మెడికల్ కళాశాలకు చేర్చడంలో కీలక పోషిస్తున్నారని ఆయన అన్నారు. దేహదాత కుటుంబ సభ్యులను అభినందించారు. అనాటమి హెచ్‌ఓడీ శశికాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన, సదాశయ ఫౌండేషన్ ప్రచార క్యాదర్శి కేఎస్ వాసు, ప్రతినిధి దబ్బెట శంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


రాజిరెడ్డి మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సమద్ నవాబ్ హఠాన్మరణం


సమద్ నవాబ్(ఫైల్)

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు పరిరక్షణ కమిటీ చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ సమద్‌నవాబ్(60) మంగళవారం సాయంత్రం మరణించారు. సోమవారం ఉదయం ఇంటి వద్ద ఉండగా ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.,


ఉప సర్పంచి ఎన్నిక ఇలా

కరీంనగర్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప సర్పంచి పదవి కోసం ఇద్దరు. ముగ్గురు పోటీ పడితే సమావేశానికి హాజరైన సభ్యులు తమ చేతులను పైకి ఎత్తడం ద్వారా ఫలితాన్ని నిర్ణయిస్తారు. ఉప సర్పంచి ఎన్నిక కోసం వార్డు సభ్యుల్లో ఒకరి పేరును మరో వార్డు సభ్యుడు లేక సభ్యురాలు ప్రతిపాదించాలి. ఇంకో సభ్యుడు లేక సభ్యురాలు బలపరచాలి. ఒకరు మాత్రమే నామినేట్ అయితే సదరు అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటిస్తారు. ఈ ఎన్నికలో సర్పంచి కూడా ఓటేసేందుకు అర్హత కలిగి ఉంటారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే సభ్యుల సమక్షంలోనే లాటరీ ద్వారా డ్రా నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

పంచాయతీ ఎన్నికలకు భద్రత కట్టుదిట్టం

- మద్యం, నగదు సీజ్ ● కోడ్ ఉల్లంఘనపై 6 కేసులు ● కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ఎన్నికల బందోబస్తు వివరాలను మీడియాకు వెల్లడించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిని సున్నితమైన/సమస్యాత్మకమైన కేంద్రాలుగా విభజించామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఒక స్టాటిక్ పోలీసు పార్టీ, ప్రతీ మార్గంలో(రూట్) ఒక రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రతీ మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించినట్లు చెప్పారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారన్నారు. కమిషనరేట్ పరిధిని మొత్తం 104 క్లస్టర్‌లుగా విభజించామని, ఎన్నికలు ప్రారంభం నాటి నుంచి ఈ క్లస్టర్లలో ప్రివెంటివ్ పెట్రోలింగ్ నిర్వహించడానికి సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌తోపాటు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను అదనంగా రాత్రి గస్తీ కోసం కేటాయించామన్నారు. గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ప్రలోభాలకు, భయ భ్రాంతులకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఇప్పటివరకు 132 అక్రమ మద్యం కేసులు నమోదు చేశామని, 10.71 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరు కేసులు నమోదు చేశామని, వాహన తనిఖీల్లో లక్ష రూపాయల నగదు పట్టుకున్నామని అన్నారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తున్నామని, వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని వెల్లడించారు.



● చర్చిలో ప్రచారం.. సర్పంచ్ అభ్యర్థిపై కేసు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మతపరమైన ప్రదేశంలో ప్రచారం నిర్వహించినందుకు గంగాధర గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి చిరుత మంగ (భర్త రమేష్) చర్చిలో సమావేశం నిర్వహించారు. తమ గుర్తు చూపిస్తూ ఓట్లు అభ్యర్థించ డంపై కేసు నమోదు చేశారు.

● వార్డు అభ్యర్థిపై..

ఎన్నికల ప్రచారం కోసం ముద్రించిన కరపత్రంలో, ఒక వ్యక్తి అనుమతి లేకుండా అతడి పేరును ప్రచురణ కర్తగా ముద్రించినందుకు వార్డు అభ్యర్థిపై కేసు నమోదైంది.

రామడుగు గ్రామంలో 8వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న అభ్యర్థి సైళ్ల బీరయ్య ఎన్నికల కరపత్రాల్లో అనుమతి లేకుండా తన పేరును ప్రచురించి, గ్రామంలో పంపిణీ చేసినట్లు పూరెళ్ల మధుకర్ ఫిర్యాదు చేశాడు.

● చొప్పదండి మండలంలోని ఆర్నకొండ శివారులో సోమవారం పోలీసుల తనిఖీల్లో తమ్మిడి కనకరాజు, గోల్కొండ మధుకర్ మోటార్ సైకిల్‌పై తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్యంతో పట్టుబడిన కనకరాజు భార్య అర్నకొండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఎన్నికల్లో గెలవడం కోసం ఓటర్లకు పంపిణీ చేయడానికి మద్యాన్ని తరలిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. రూ.49,920 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● మానకొండూరు మండలం చెంజర్లలో సర్పంచ్ అభ్యర్థి గోల్లేన కనుకవ్వ సీరియల్ నంబర్‌ను తప్పుగా ముద్రించిన నకిలీ నమూనా బ్యాలట్ పేపర్లు పంపిణీ చేసి, ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినట్లు కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న గడ్డి రేణుకతో పాటు గడ్డి గణేష్, ఆదిత్య ప్రింటింగ్ ప్రెస్ యజమానిపై కేసు నమోదు చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలం చెర్లభూత్కూర్‌లో మద్యం పంపిణీ చేస్తున్న వార్డు అభ్యర్థి జడా అంజయ్య, అతడి స్నేహితుడు చిట్కూరి మల్లేష్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదైంది.

ధర్మపురి నరసింహుని సన్నిధిలో జీయర్‌స్వామి పూజలు


జీయర్‌స్వామికి ప్రసాదాలు అందిస్తున్న ఆలయ చైర్మన్, అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి మంగళవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో పీఠాధిపతి ప్రత్యేక పూజలు జరిపారు. అంతకు ముందు యమధర్మరాజు ఆలయం వద్ద స్వామీజీ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన స్వామీజీకి శేషవస్త్రం, పండ్లు, ఫలాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు
స్వయం ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు

జమ్మికుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకం ముఖ్య ఉద్దేశ్యమని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ల పథకంపైన నాబార్డ్ ఆధ్వర్యంలో శిక్షణ నైపుణ్య కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లు, వ్యవసాయ సంబంధిత కోర్సులు చేసిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. నాబార్డ్ డిడియం జైప్రకాష్ మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నోడల్ శిక్షణ సంస్థల ద్వారా 45రోజుల ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ వ్యాపార యూనిట్లు స్థాపించడానికి బ్యాం కుల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికా రిణి భాగ్యలక్ష్మి, కెవికె ప్రధానకార్యదర్శి విజయ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోయినికుంట గ్రామానికి ఓ వ్యక్తి మద్యాన్ని వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ నుంచి మోయినికుంట గ్రామానికి చెందిన పల్లాటి కుమార్ అనే వ్యక్తి 167 మద్యం బాటిళ్లను మోయినికుంటకు ఓ కారులో తరలిస్తుండగా పట్టుకొని కారును, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.



- పైసా ఖర్చు లేకుండా అభ్యర్థుల ప్రచార హోరు
- ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు
- ప్రచార ఫొటోలు... వీడియోలు..

ముత్తారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పోటీదారులు ప్రచారాన్ని ముమ్మరంచేశారు. రోడ్ల వెంట వెళ్లే వారిని సైతం పలకరిస్తూ వారికి ఏ అవసరం ఉన్న తీరుస్తూ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఏ అవకాశం దొరికిన తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది సామాజిక మాధ్యమాలే వేదికగా ఎన్నికల ప్రచార హోరు ఊపందుకుంటుంది.

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు అందరికీ ఉంటున్నాయి. ప్రపంచంలో ఏ మూలన ఏం జరుగుతుందో క్షణాల్లో అరచేతిలో ప్రత్యక్షమవుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు మూస ధోరణి ప్రచార విధానాలకు స్వస్తి పలుకుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి అరచేతిలోనే మొబైల్ ఆయుధాన్ని వాడుతున్నారు. సామాజిక మాధ్యమాలపై పట్టు ఉన్న నాయకులు తామే స్వయంగా ఖాతాలను నిర్వహిస్తుండగా, వినియోగించుకుంటు మరికొందరు నాయకుల ఖాతాలను ప్రధాన అనుచరులు నిర్వహిస్తున్నారు. చిత్రాలు, వీడియోలు, ప్రచారం ప్రత్యర్థులపై విమర్శలు, కౌంటర్లు ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

● ప్రత్యేకంగా వాట్సాప్ గూపులు



సర్పంచి ఎన్నికల వేళ అభ్యర్థుల పేరుతో ప్రత్యే కంగా మరికొన్ని గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా గ్రూపుల్లో తమ ప్రచారాలు, గ్రామాభి వృద్ధిపై ఓటర్ల అభిప్రాయాలు, నేతల సందేశాలు, హామీలు, రోజువారి కార్యక్రమాలను పోస్టు చేస్తున్నారు. ప్రత్యర్థులు పెట్టే పోస్టులకు సమాధానంగా మరికొన్ని పోస్టులు పెడుతున్నారు. అభ్యర్థులతోపాటు వారి మద్దతుదారులు, కుటుంబ సభ్యులు వీటినే ప్ర చార అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో మహిళల పేరుతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటుచేసి గుర్తులను పెడుతూ గుర్తుంచుకోండి అంటూ ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో ప్రత్యేక ఆకృతులను రూపొందించి ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నారు. తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. మొత్తంగా అభ్యర్థులు మామూలు ప్రచారం కంటే సోషల్ మీడియా ద్వారానే ప్రచారం ముమ్మరం చేసుకుంటున్నారు.

● గ్రూపుల్లో చర్చోపచర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతోపాటు గ్రామాలు, కుల సంఘాలు, యువజన సంఘాల పేర్లతో ఉన్న గ్రూపుల్లో ఎక్కడ చూసిన ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలో ఉన్న, అభ్యర్థులకు అనుకూలంగా, ప్రతికూలంగా కామెంట్లు పెడుతు న్నారు. పార్టీల మద్దతు ఆశించి భంగపడ్డవారు, వారి అనుచరులు, అవకాశం దక్కిన వారు, వారి మద్దతుదారుల పోటాపోటీగా సోషల్ వార్ కొనసాగుతోంది.

వేములవాడ ఆలయ హుండీ ఆదాయం రూ.1.29కోట్లు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ భీమేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ 14 రోజుల హుండీ ఆదాయం కోటి 29 లక్షల 27 వేల 470 రూపాయలు, 60.5 గ్రాముల మిశ్రమ బంగారం, 3 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రమాదేవి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

అరుణాచలం, రామేశ్వరం ప్రత్యేక సర్వీసులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ డిపో నుంచి అరుణాచలం, రామేశ్వరానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. ఈ నెల 15న గోదావరిఖని బస్టాండ్ నుంచి మధ్యాహ్నం 1గంటకు బయలు దేరి కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పళని, పాతాళ శంభు, మధురై, రామేశ్వరం విష్ణుకంచి, శివకంచి, జోగులాంబ పదియాత్రలు పూర్తి చేసుకుని, అనంతరం 22న గోదావరిఖని బస్టాండ్‌కు చేరుకుటుందని తెలిపారు. ఈ సర్వీస్ పెద్దలకు రూ. 8000, పిల్లలకు రూ.6000 చార్జీలు నిర్ణయించినట్టు చెప్పారు. మరిన్ని వివరాలకు 7382847596, 7013504982 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బంజేరు గ్రామ పంచాయతీ పరిధిలోని కోక్యాతండాలోని సారా స్థావరాలపై ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 2 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులైన గుగులోతు ప్రమీల, గుగులోతు చంకు, గుగులోతు రాంజీ, గుగులోతు కంసాలిలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ


● భారత్‌కు బంగారు పతకం సాధించిన అర్చన



చాంపియన్‌షిప్ కప్‌తో అర్చన

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆడబిడ్డ మిట్టపెల్లి అర్చన రాణించింది. ఫైనల్స్‌లో విజయం సాధించి బంగారు పతకం సాధించడంలో అర్చన కీలక పాత్ర పోషించింది. భారత్ విజయంలో సారథిగా నిలిచిన అర్చనకు మంగళవారం జిల్లాలోని క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో శ్రీలంకలో జరిగిన మొదటి సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలో భారత జట్టుకు అర్చన ప్రాతినిధ్యం వహించింది. ఫైనల్స్‌లో ఆతిథ్య దేశం శ్రీలంక జట్టుపై పోరాడి విజయం సాధించడంలో అర్చన కీలకపాత్ర పోషించింది. ప్రపంచ పారా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిర్మలరావత్ చేతుల మీదుగా విజేత భారత్ జట్టు సభ్యులు చాంపియన్‌షిప్ కప్‌తో పాటు బంగారు పతకాలు(మెడల్స్)ను అందుకున్నవారిలో అర్చన ఉంది. క్రీడలలో అంగవైకల్యం అడ్డుకాదని మహిళ జట్టు సభ్యులు నిరూపించి ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన మిట్టపల్లి అర్చన చిన్నతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎడమ చెయ్యి కాలిపోయింది. అయినా ఆత్మ విశ్వాసంతో ఒకవైపు విద్యాభ్యాస్యం చేస్తూనే క్రీడలపై ఉన్న మక్కువతో మరోవైపు త్రోబాల్ ఆడుతూ మొక్కవోని దీక్షతో ముందుకు సాగింది. ఎంఏ, బీఈడీతో పాటు ఎంఎస్సీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం రాకున్నా నిరత్సాహపడలేదు. అవుట్ సోర్సింగ్‌లో చిన్న ఉద్యోగం చేస్తూ సొంత ఇల్లు లేకున్నా ఆర్థిక ఇబ్బందులున్న ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ త్రోబాల్ ప్రాక్టీస్ చేసింది. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనకు కనబరుస్తూ ఎన్నో పతకాలను సాధించిన అర్చన జట్టు సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపి యన్‌షిప్ పోటీల్లో శ్రీలంక జట్టుపై గెలిచింది.

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో
'కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ'



కరీంనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకారులు తయారు చేసిన బుద్ధుడి ప్రతిమలు కనువిందు చేశాయి.పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుద్ధుడి ప్రతిమను అందజేశారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ముందురోజు భక్తులు భీమేశ్వర స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేకంగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

ఇల్లంతకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి కీసరి సుజాత కట్టిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంపై మంగళవారం మండలస్థాయి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని కోరారు.

శాతవాహన యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



వివిధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. యూనివర్సిటీ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపునకు ప్రయత్నించాలన్నారు. యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకొని అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విజేతలుగా నిలిచి శాతవాహన యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు, ఫుట్‌బాల్ కోచ్‌లు పాల్గొన్నారు.

ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న కమిటీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడే ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా ప్రజలు ఏసీబీ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతీయ మానవ హక్కుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ అవినీతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఏసీబీ అడిషనల్ డీజీ చారుసింహా రాష్ట్రంలో అవినీతి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడం కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టడాన్ని తాము హర్షిస్తున్నామని అన్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు ఫోన్ నెంబర్లను ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద, పట్టణ, గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఏసీబీకి పట్టుబడ్డ అవినీతి ఉద్యోగులు కొన్ని నెలలకు మళ్లీ విధుల్లోకి చేరుతున్నారని ఇది బాధాకరమని అన్నారు. ఒకసారి ఏసీబీకి చిక్కిన అవినీతి ఉద్యోగులను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించే చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు చిప్ప దేవదాస్, ఉపాధ్యక్షులు వేముల పోశెట్టి, సభ్యులు చీకోటి అనిల్‌కుమార్, దేవులపల్లి శ్రీరాములు, కుసుమ గణేష్ ఉన్నారు.

పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద రూ.3 లక్షల నగదు పట్టివేత

గంభీరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు రూ. 3 లక్షల నగదును పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌లు పెద్దమ్మ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 3 లక్షల నగదు పట్టుబడింది. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపు వెళుతున్న కారును సోదా చేయగా, 3 లక్షల నగదు లభ్యమైంది. దొరికిన రూ. 3 లక్షల నగదును సీజ్ చేశామని పోలీస్‌లు తెలిపారు.

రూ.7,450 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లు చేపడుతున్న వ్యాపారులు

జమ్మికుంట, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 47మంది రైతులు 447క్వింటాళ్ల విడి పత్తి విక్రయా నికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్

గణేశ్‌నగర్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఎల్‌ఎండీ క్యాంపస్‌లో గల ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా కే శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవినీతి వల్ల కలిగే నష్టాలను వివరించారు. పారదర్శక, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణకుమార్, పున్నం చందర్, కళాశాల విభాగాధిపతి జీయల్ అర్చన, అధ్యాపకులు డా బి భాగ్యలక్ష్మి, డా కే సునీత, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

● ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యల నిలయాలుగా మారిన సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలు, ఫుట్‌బాల్ ఆటల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై లేదని ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం చేనేత వస్త్ర వ్యాపారం సంఘం భవనంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాల్గవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా స్థానిక కార్మిక భవనం నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా సంఘం భవనం వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం భవనం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ జెండాను జిల్లా అధ్యక్షుడు రాకేష్ ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిందని దేశంలోని విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయడానికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. జాతీయ విద్యా విధానం పేరుతో దేశ వ్యాప్తంగా విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠ్యాంశాలలో మత పరమైన అంశాలను చేరుస్తూ చరిత్రను తొలగించే ప్రయత్నాలను విద్యార్థులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విభజన హామీలలో తెలంగాణకు రావాల్సిన కేటాయింపులను తీసుకురావడంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విఫలమయ్యారన్నారు. తెలంగాణలో రెండేళ్ల ప్రజాపాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేక పోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారిరాములు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర బాలికల విభాగం కో కన్వీనర్ కండె విజేత, జిల్లా కార్యదర్శి మంద అనిల్, నాయకులు పెండల ఆదిత్య, ముద్రకోల శశికుమార్, బండారి చందు, బండి ప్రణయ్, వంశీ ఉన్నారు.

అటవీ అధికారిపై దాడి.. కేసు నమోదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు9(ఆంధ్ర జ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎఫ్‌బీవో బోనాల శ్రీకాంత్‌పై దాడి చేసిన సంఘటనలో అదే తండా వాసి తేజావత్ మోహన్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. తండా శివారులోని అటవీ భూమిలోకి మోహన్ అక్రమంగా ప్రవేశించడంతో పాటు బోరు బావి తవ్విస్తున్నాడనే సమాచారంతో ఎఫ్‌బీవో శ్రీకాంత్ అక్కడకు చేరుకున్నారని పేర్కొన్నారు. అటవీ భూమిలో బోరు ఎందుకు వేయిస్తున్నావని ప్రశ్నిస్తే దాడికి దిగాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు. అటవీభూమి ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అన్నారు.

● సంక్షిప్తంగా..

భగత్‌నగర్: రేకుర్తి 18వ డివిజన్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోహమ్ అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఏటీఎల్ ల్యాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ వర్క్‌షాప్ నిర్వహించారు.

కరీంనగర్ టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు పోటీచేస్తున్న రజకులను గెలిపించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

సుభాష్‌నగర్: తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కవితరెడ్డి తెలిపారు. శంకరపట్నంలోని ఆల్‌ఫ్రైడ్ నోబుల్ స్కూలులో శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని వైశ్యభవన్‌లో సుధామ వాకింగ్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌కు చెందిన మేఘరాజ్‌శర్మచే భాగవత ప్రవచనం కొనసాగుతుంది. ఆయన మంగళవారం భాగవతంలో వివిధ ఘట్టాలను శ్రోతలకు వివరించారు.

జమ్మికుంట: జమ్మికుంటలోని ఓ రైస్ మిల్లులో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జమ్మికుంటలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

శంకరపట్నం: కేశవపట్నం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం మంగళవారం కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

చొప్పదండి: రుక్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్నేహితపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. బాలబాలికల భద్రత, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు.

దేశ అభ్యున్నతికి కృషి చేసిన సోనియా

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దేశ అభ్యున్నతికి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ కృషి చేశారని, డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు. సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డితో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్య నారాయణ మాట్లాడుతూ సోనియా గాంధీ ఆశీస్సులతో, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో ముందు కెళ్తోందన్నారు.

●వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కాలేజీలో కాంగ్రెస్ నేత చక్రధర్‌రావు, వీర దేవేందర్ పటేల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యులు అంజన్‌కుమార్ హాజరై కేక్ కట్ చేశారు. మహిళా నేత వెన్నం రజితరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో భగత్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరేపల్లి మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, మడుపు మోహన్, పహాడ్, ఆకారపు భాస్కర్ రెడ్డి, వంగల విద్యాసాగర్, గడ్డం విలాస్ రెడ్డి, చర్ల పద్మ, కర్ర రాజశేఖర్, అజీమ్ మహమ్మద్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో సీతారామ చంద్ర స్వామి ఆలయంలో సోనియా గాంధీ పేరు మీద అర్చనలు, పూజలు చేయించారు. నాయకులు వంగ రామకృష్ణ, పెద్ది శివకుమార్, మంకు అయిలయ్య, మీచ రాజయ్య, బండి మల్లయ్య, వీరారెడ్డి, రమేష్, పరమేశ్వర్, కిరణ్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంటలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ కేక్ కట్ చేశారు.

వీణవంక: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోనియా జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, నాయకులు సాహెబ్ హుస్సేన్, రషీద్, సునీల్, చినాల అయిలయ్య, కుమార్, సంపత్ పాల్గొన్నారు.

ఓటే భవితకు బాట సీడీ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కంసాని ఉదయ ప్రకృతి ప్రకాశ్ నిర్మించిన ఓటే భవితకు బాట ఆడియో సీడీని కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం కార్యాలయంలో కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ అశ్వినీతానాజీ వాకడేతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానమైందని, ప్రజల చేతిలో ఆయుధమని అన్నారు. పాటల రచయిత ప్రకృతి ప్రకాశ్, ఆలపించిన కంసాని ఉదయ, ప్రకృతి ప్రకాశ్‌ను అభినందించారు.

చలి తీవ్రతతో గుండెపోటు ప్రమాదం

సుభాష్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రతతో నరాలు కుచించుకుపోయి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని మెడికవర్ వైద్యులు తెలిపారు. మంగళవారం మెడికవర్ ఆస్పత్రిలో సీజనల్‌లో వచ్చే గుండె జబ్బులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ చలికాలం నీరు తక్కువగా తాగడంతో కర్తం చిక్కబడుతుందని, ఆస్తమా, స్మోకింగ్‌తో ఊపిరితిత్తుల దారులు మూసుకుపోయి గుండెపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. అలాగే రక్తం చిక్కబడడం, రక్త సరఫరాలో ఇబ్బందులతో గుండెకు ఆక్సిజన్ అందక గుండె పోటు, బ్రేయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదముందన్నారు. ఈ సీజన్‌లో షుగర్ పేషెంట్లు వాతావరణ కాలుష్యంతో ఊపిరితిత్తుల బారిన పడుతున్నారన్నారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కార్డియాలజిస్టులు డాక్టర్ వాసుదేవరెడ్డి, డాక్టర్ అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, క్రిటికల్‌కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, ఆపరేషన్ మేనేజర్ సాయిచరణ్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం రాష్ట్ర కమిషనర్ రాణికుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధి కారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత సమస్యలు తలెత్తకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, ఎన్నికల పరిశీలకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానకొండూర్: ఎన్నికల నియమావళిపై ఎంపీడీవో వరలక్ష్మీ మంగళవారం ఆర్వోలు, పీవోలకు మానకొండూర్‌లో అవగాహన కల్పించారు. ఎంపీవో సతీష్‌రావు, ఎంఈవో మధుసుదనాచారి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: సిరిసేడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, వెంకట్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్సైలు క్రాంతి కుమార్, తిరుపతి, యూనస్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి, మడిపల్లిలో ఏసీపీ మాధవి ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నారు. సీఐ రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి, చల్లూరు, వీణవంకలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీ నారయణ, ఎస్సై తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు భరోసా కల్పించేందుకు స్నేహిత

హుజూరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ధైర్యం, భరోసా నింపేందుకే స్నేహిత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్‌లో స్నేహిత ఫేస్-2 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసీదాస్, సీడీపీవో సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో వెంకట రమణ మాట్లాడుతూ స్నేహిత బాలి కలను శక్తి వంతం చేయడానికి దోహదపడుతుందన్నారు. అంతకుముందు వావిలాల పీహెచ్‌సీని తనిఖీ చేశారు.

సైదాపూర్: మండంలోని బొమ్మకల్, అఅమ్మనగుర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం ఆరోగ్య పర్యవేక్షకుడు రమేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భిక్ష ఏర్పాటు


కార్యక్రమంలో మంత్రి పొన్నం కుటుంబ సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా మంగళవారం భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. స్వామి దయతో అందరు దీక్షాపరులు ఆటంకాలు లేకుండా యాత్ర పూర్తి చేయాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఫోన్ ద్వారా తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, మంత్రి తల్లి పొన్నం మల్లమ్మ, కుటుంబ సభ్యులు పొన్నం అనూప్, పొన్నం రోహిత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు పద్మాకర్‌రెడ్డి, రాజశేఖర్, ఆకారపు బాస్కర్ రెడ్డి, పొన్నం శ్రీనివాస్, వెంకటరమణ, గడ్డం విలాస్‌రెడ్డి, రజిత, ఆలయ చైర్మన్ వై.అనిల్ కు మార్‌గౌడ్, ఈవో కాంతారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు రాముల కుమార్ ఆధ్వర్యంలో సిర్సపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తూముల వెంకట్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థులకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడం దండగని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

చొప్పదండి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి, మానకొండూర్ రైస్ మిల్లర్లు ధాన్యంలో తరుగు పేరిట కోత విధిస్తున్నారని, రైతులకు న్యాయం చేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం తహసీల్దార్ నవీన్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున అదనంగా కోత విధిస్తున్నారన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): అవినీతి రహిత సమాజం మనందరి లక్ష్యమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవినీతిని నిరోధిస్తామని అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో విద్యార్థులు, యువత పాత్ర చాలా కీలకమన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి రహిత దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్, ఏసీవో సంపత్ కుమార్, ఏవో శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్

గణేశ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో మంగళవారం విజయ్ దివస్ నిర్వహించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు తెలంగాణ తల్లిచిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, నగర మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, కరీంనగర్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, నగర బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బొంకూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ

ఇల్లందకుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇల్లందకుంట మండలంలోని బోగంపాడు సర్పంచ్‌గా ఏలేటి నిర్మల-రఘుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు ప్రకటించారు. గ్రామంలో 8 వార్డులకు 7 ఏకగ్రీవమైనట్లు, 8వ వార్డుకు మాత్రం ఎన్నిక జరగనున్నట్లు తెలిపారు.

సైదాపూర్‌మండలంలోని ఆరెపల్లి సర్పంచ్ స్థానానికి, 8 వార్డుల స్థానాలకు ఒకటి చొప్పున నామినేషన్ రావడంతో సర్పంచ్‌గా వర్నె లావణ్య- మోహన్ రావు(కాంగ్రెస్) ఏకగ్రీవమయ్యారు. వార్డు సభ్యులు ఆవునూరి సుజాత, లొల్లేటి కళ్యాణి, వెంగళ కుమార్, గుంటి అయిలయ్య, వెంగళ రవి, మొగిళి లచ్చమ్మ, గొంగళ్ల మల్లేశ్వరి, వర్నె సతీష్ ఏకగ్రీవంగా ఎన్ని కైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలో మరో 54 వార్డులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. సైదాపూర్ మండలం ఒక సర్పంచ్, మొత్తం 62 వార్డులు ఏకగ్రీవమయ్యాయని ప్రకటించారు. ఆకునూర్ 1, అమ్మనగుర్తి 4, బొమ్మకల్ 1, దుద్దెనపల్లి 1, ఎక్లాస్‌పూర్ 2, గర్రెపల్లి 2, గొడిశాల 2, గుజ్జులపల్లి 3, గుండ్లపల్లి 6, నల్లరామయ్యపల్లి 3, పెర్కపల్లి 3, రాయికల్‌తండా 7, రాములపల్లి 6, సైదాపూర్ 2, సర్వాయిపేట 4, సోమారం 1, వెంకటేశ్వర్లపల్లి 2, వెన్కేపల్లి 1, వెన్నం పల్లి 1, ఎల్లంపల్లి 1 ఏకగ్రీవం అయ్యాయి. సైదాపూర్ మండలంలో ఇంకా 26 గ్రామాల సర్పంచ్ స్థానాలకు, 176 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.


ఏలేటి నిర్మల, బోగంపాడు ఏకగ్రీవ సర్పంచ్


లావణ్య-మోహన్ రావు, ఆరెపల్లి, ఏకగ్రీవ సర్పంచ్


సరోజన మధుకర్‌రెడ్డి, మల్లన్నపల్లి, ఏకగ్రీవ సంర్పంచ్

వీణవంక: మండలంలోని మల్లన్నపల్లి సర్పంచ్‌గా కలకొండ సరోజన ఏకగ్రీవమయ్యారు. 8 వార్డులకు ఐదు ఏకగ్రీవమయ్యాయి. మండలంలో 26 గ్రామాలకు 25 గ్రామాల్లో అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. 246 వార్డులకు ఏకగ్రీవమయ్యాయి. 25 సర్పంచ్‌లకు 110 మంది పోటీలో ఉండగా 221 వార్డులకు 622 మంది బరిలో నిలిచారు. మండలంలోని బ్రహ్మణపల్లి 1,హిమ్మత్‌నగర్ 2, ఇప్పలపల్లి 1, లస్మక్కపల్లి 1, మల్లన్నపల్లి 5 మల్లా రెడ్డిపల్లి 1, మామిడాలపల్లి 4, నర్సింహులపల్లి 1, రామకృష్ణాపూర్ 1, శ్రీరాములపేట 7, వీణవంక 1, మొత్తం 24 ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలంలో మొత్తం 20గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 112మంది పోటిలో ఉండగా, 22మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా, 90మంది పోటిలో నిలిచారు. 188వార్డు స్థానాలకు గాను 507మంది పోటిలో ఉండగా, 46మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా, 33వార్డులు ఏకగ్రీవం కాగా, 428మంది పోటిలో ఉన్నారు. శంభునపల్లి గ్రామంలో మొత్తం ఎనిమిది వార్డులకు ఏడు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలో 18 గ్రామపంచాయతీలకు బోగంపాడు గ్రామ సర్పంచ్ ఏలేటి నిర్మల ఏకగ్రీవమైంది. 17 గ్రామపంచాయతీలకు 78మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 166 వార్డు స్థానాలకు 34 ఏకగ్రీవమయ్యాయి. 132 వార్డులకు 378మంది పోటీలో ఉన్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు. బోగంపాడు జనరల్ మహిళకు రిజర్వేషన్ కాగా ముగ్గురు నామినేషన్ వేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రూ.21లక్షలకు ఏకగ్రీవమైనట్లు చర్చ సాగుతోంది. దీంతో పాటు 8వార్డులకు 7వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్‌ల ఉపసంహరణ మంగళవారంతో ముగిసింది. 20 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 116 మంది బరిలో ఉండగా.196 వార్డు స్థానాలకు గాను 17 వార్డులకు సింగిల్ నామినేషన్‌లు రాగా 179 వార్డులకు 490 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మంగళవారం నామినేషన్‌ల ఉపసంహరణ ఉండగా 20 సర్పంచ్ స్థానాలకు 116 మంది బరిలో ఉండగా 35 మంది నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. అలాగే 196 వార్డు స్థానాలకు గాను 30 వార్డులు ఏకగ్రీవం కాగా 166 వార్డులకు 430 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలో 27 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా ఒక ఆరెపల్లి సర్పంచ్ స్థానం ఏకగ్రీవం కావడంతో 26 గ్రామాల సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 26 సర్పంచ్ స్థానాలకు 94 మంది బరిలో ఉన్నారు. మండలంలో 238 వార్డులుండగా అందులో 62 వార్డులు ఏకగ్రీవం కాగా 176 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. 176 వార్డు సభ్యుల స్థానాలకు 438 మంది బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన 'తొలి' ప్రచారం

(5వ పేజీ తరువాయి)

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇల్లందకుంట మండలం బోగంపాడు సర్పంచ్‌గా నిర్మల రఘుపతిరెడ్డి, వీణవంక మండలం మల్లన్నపల్లి సర్పంచుగా కలకొండ సరోజన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- హుజూరాబాద్ మండలంలో 20 గ్రామాల్లో సర్పంచ్ పదవులకు 81 మంది పోటీలో ఉన్నారు. 196 వార్డుల్లో 30 వార్డుల సభ్యులు ఏకగ్రీవమవగా మిగిలిన 166 వార్డుల్లో 430 మంది పోటీచేస్తున్నారు.

-జమ్మికుంట మండలంలోని 20 పంచాయతీల్లోని సర్పంచ్ పదవులకు 90 మంది పోటీలో ఉన్నారు. 188 వార్డుల్లో 33 సభ్యులు ఏకగ్రీవమయ్యారు. మిగిలిన 155 వార్డులకు 461 మంది బరిలో ఉన్నారు.

- ఇల్లందకుంట మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఒక సర్పంచ్ ఏకగ్రీవమైంది. 17 సర్పంచ్ పదవులకు 78 మంది పోటీలో ఉన్నారు. 166 వార్డుసభ్యుల స్థానాల్లో 34 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 132 స్థానాలకు 378 మంది పోటీలో ఉన్నారు.

- వీణవంక మండలంలోని 26 గ్రామాల్లోని సర్పంచ్ స్థానాల్లో ఒకటి ఏకగ్రీవమైంది. 25 పదవులకు 110 మంది పోటీలో ఉన్నారు. 246 వార్డుల్లో 25 ఏకగ్రీవమయ్యాయి. 221 వార్డులకు 622 మంది పోటీలో ఉన్నారు.

- సైదాపూర్ మండలంలోని 27 గ్రామాల్లో ఒక సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. 26 సర్పంచ్ పదవులకు 94 మంది పోటీలో ఉన్నారు. 238 వార్డుల్లో 62 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 176 వార్డులకు 438 మంది పోటీలో ఉన్నారు.

- మూడో విడత ఎన్నికలు జరిగే 108 సర్పంచ్ స్థానాలకు 453, 850 వార్డులకు 2,329 మంది అభ్యర్థులు పోటీచేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు మంగళవారం గుర్తులు కేటాయించడంతో వారు ప్రచారాన్ని ప్రారంభించారు.

● ఊపందుకున్న రెండో విడత ప్రచారం

రెండో విడతలో ఎన్నికలు జరుగనున్న గ్రామపంచాయతీల్లో ప్రచారం ఊపందుకుంది. ఈ విడతలో తిమ్మాపూర్, మానకొండూర్, చిగురు మామిడి, శంకరపట్నం, గన్నేరువరం మండలాల పరిధిలోని 113 గ్రామ పంచాయతీలకు రెండు సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 111 సర్పంచు పదవులకు 438 మంది, 849 వార్డులకు 2,472 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారానికి మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

కరీంనగర్ రూరల్, భగత్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని కోరారు. కాంగ్రెస్ మండల, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ కరీం నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. స్థానిక మైత్రీ హోటల్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపిం చాల ని విజ్ఞప్తి చేశారు.

మన్నెంపల్లిలో రవీందర్ సింగ్ ప్రచారం

తిమ్మాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని మన్నెంపల్లి సర్పంచ్ అభ్యర్థి తరఫున కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థి హామీలు అభినంద నీయమన్నారు. అభివృద్ధి చేసేవారిని ఆదరించాలని, ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రచారంలో రవీందర్ సింగ్

ఆర్టీసీ తీర్థయాత్రల ప్రత్యేక టూర్

భగత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తీర్థయాత్రల ప్రత్యేక టూర్ ప్యాకేజీలో భాగంగా కరీంనగర్-1 డిపో నుంచి పలు ఆలయాల దర్శనాల కోసం ప్రత్యేక బస్సును నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీన కరీంనగర్ బస్టాండ్ నుంచి ఉదయం 3.30 నిమిషాలకు బయల్దేరుతుందని, బీదర్ జలా నర్సింహస్వామి, బీదర్ పోర్ట్, జరాసంగం, రేజింతల్ దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం అదే రోజు రాత్రి కరీంనగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సులో పెద్దలకు 1400గా, పిల్లలకు 1080 చొప్పున చార్జీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 7382849352చ, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరెపల్లి ఉపసర్పంచ్‌గా వెంగళ రవి

సైదాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో ఏకగ్రీవమైన ఆరెపల్లి ఉపసర్పంచ్‌గా అయిదవ వార్డు సభ్యుడు వెంగళ రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వర్నె లావణ్య, ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వెంగళ రవితో పాటు ఏడుగురు వార్డు సభ్యులకు మంగళవారం నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో జిల్లా నాయకత్వం

భగత్‌నగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో కరీంనగర్ నుంచి 14 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో మూడేళ్లుగా నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలు అనుభవాలపై చర్చించారు. రాష్ట్ర మహాసభల్లో జిల్లా రిపోర్ట్‌ను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, శ్రీలత, నలువాల స్వామి, జనగాం రాజమల్లు, కొప్పుల శంకర్, శ్రీనివాస్, విద్యాసాగర్, సదానందచారి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్రం

చొప్పదండి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం అవతరించిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. దీక్షా విజయ్ దివస్ సందర్భంగా చొప్పదండిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వీణవంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్లకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం కాంగ్రెస్ నియోజికవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు గాజుల మధునయ్య, సమ్మయ్య, కిషన్, శ్రీనివాస్, శంకర్ చేరారు. మార్కెట్ డైరెక్టర్ రషీద్ పాషా, కట్కూరి ఉపేందర్ రెడ్డి, గాజుల శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టూ ఏడీఈ లావణ్య తెలిపారు. బైపాస్ రోడ్, పాలిటెక్నిక్ ఐటీఐ కళాశాల ప్రాంతాలు, డీ మార్ట్, శ్రద్ధయాని హోటల్, అల్కాపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చివరి రోజు హోరాహోరీ ప్రచారం

గంగాధర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా చివరి రోజు అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. పెద్ద గ్రామాల్లో నువ్వానేనా అన్నట్టు ప్రచారంతో పాటు ఎన్నికల ఖర్చుకు వెనకాడడంలేదు. పెద్ద గ్రామ పంచాయతీల్లో రూ.60 లక్షల వరకు ఖర్చు చేస్తుండగా చిన్న గ్రామపంచాయతీల్లో రూ.20 వరకు ఖర్చు పెడుతున్నారు. మంగళవారం బహిరంగ ప్రచారానికి తెరపడగా ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ జోరుగా సాగుతోంది.